తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
29 ఆగస్టు 2026

# ఖబ్జా ఒకే.. పున నిర్మాణం సంగతేంటి..!

- జుటయ్య కుంట ముప్పులో బిజినేపల్లి గ్రామం
- ధ్వంసం చేసిన కుంట కట్ట పున నిర్మించని అధికార యంత్రాంగం
- మరో మారు ఖబ్జాకు అవకాశమా..?





**బిజినపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి):** మండల కేంద్రంలో నివాస ప్రాంతాలకు అనుకొని ఉన్న జుటయ్య కుంట కట్టను ధ్వంసం చేసి ఖబ్జా చేయాలనుకునే నేతలకు అధికారుల చర్యల్లో శూన్యం భవిష్యత్తులో వారికి ఒక వరంలా మారిందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. గత మార్చి నెలలో గ్రామానికి చెందిన పెద్ద నాయకులు జుటయ్య కుంట కట్టపై కూర్చొని దర్జాగా చుక్కేస్తూ ద్వంసానికి పాల్పడ్డారు. వీరిపై కేసు నమోదు అయింది. కానీ మరి కొందరు నాయకులు తెర వెనుక ఉండి భవిష్యత్తులో ఖబ్జాపై రాజకీయ ఒత్తిడి తెచ్చి పున నిర్మాణం కాకుండా చేసే విషయమై పావులు కదుపుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇప్పటి వరకు చూసి చూడనట్టుగా ఉండటమే కాకుండా, మా వంతు ఆదేశాలు జారీ చేశాం, మా పని అయిపోయిందన్నట్టుగా వ్యవహారం ఉందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ముంపులో బిజినేపల్లి గ్రామం...**

ఈ మధ్య కాలంలో వర్షాలు పెద్దగా కురువక పోవడంతో బిజినేపల్లి గ్రామం జుటయ్య కుంట ముంపు నుండి తప్పించుకుంది. బారీగా వర్షాలు కురిస్తే, కుంట కట్ట ధ్వంసం చేసిన ప్రాంతం నుండి వరద వచ్చి దాని కింద ఉన్న కొత్త కాలనీ ముంపుకు గురయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు నెలల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉంది. కుంట కట్ట ఖబ్జా చేసిన ప్రాంతంలో అధికారులు తిరిగి మరమత్తులు చేపట్టలేదు. ఈ మధ్య కాలంలో గ్రామానికి చెందిన కొందరు నాయకులు కట్టను పున నిర్మించాలని ఉన్నతాధికారులకు వినతి పత్రం అందించారు. నేటి వరకు అధికారుల నుండి కట్ట పున నిర్మాణంపై ఎలాంటి చలనం లేదు. అధికారులు చలనం లేకపోవడంపై ఎన్నో అనుమానాలకు తావిస్తోందని ప్రజలు చర్చిస్తున్నారు.

**మరోమారు కబ్జాకు అవకాశమా..!**

అధికారులు కట్టను పున నిర్మించే విషయంలో ఎన్నో అనుమానాలకు తావిస్తుంది. ఖబ్జా విషయాన్ని ప్రజలు మారిచాక భవిష్యత్తులో మరల ఖబ్జా చేసేందుకు పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే మొదటి స్టెపుగా కట్ట పున నిర్మాణం కాకుండా చూస్తున్నారు. ఇందులో అధికారులు, గ్రామ నాయకుల ఉమ్మడి పాత్ర ఉన్నట్టుగా స్పష్టంగా అర్థం అవుతున్నది.

**ఖబ్జాలో స్థానిక పెద్దసారు, ఓ మంత్రి హస్తం!**

జుటయ్య కుంట కట్టను మండల నాయకులు కొందరు బహిరంగంగానే దర్జాగా ధ్వంసం చేస్తే అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజా ప్రతినిధులు తెర వెనుక ఉండి రాజకీయం చేసి కేసును నీరు గార్చారు. స్థానిక అధికార పార్టీ నాయకులకు స్థానిక పెద్దసారు ఆశీస్సులు దివ్యంగా ఉన్నాయని, ఓ మంత్రి అండ దండలు కూడా ఉండటంతోనే కుంట కట్ట పున నిర్మాణంలో పురోగతి లేదని మండల ప్రజలు చర్చిస్తున్నారు. అంతా మరిచాక మరో మారు కుంట కట్టను ధ్వంసం చేసి ప్లాట్లు చేయడానికి స్థానిక నేతలు పెద్దసారు అండతోనే

ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టబోతున్నారని, అందుకు తగిన ప్రణాళిక ఈ నేతల వద్ద ఉందని, విడుతల వారీగా అమలు చేస్తారనే వార్తలు గుప్పుమంటున్నాయి.



### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు

# రాఖీలు కట్టిన బాలసదనం పిల్లలు

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 28(జనంసాక్షి):** శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ నందు బాలసదనం పిల్లలు జిల్లా కలెక్టర్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు చూపించిన ప్రేమ, ఆప్యాయత నాకు ఎంతో ఆనందం కలిగించింది. వారితో కలిసి ఈ పండుగను జరుపుకోవడం నాకు సంతోషంగా ఉందని అన్నారు. అలాగే, బాల సదనం పిల్లల చదువు, ఆరోగ్యం కొరకు ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుంది, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిపిఓ నర్సింహులు, సూపరిడెంట్ వెంటేశ్వరి, పి.ఓ.ఐ.సి ఇంచార్జ్ సురేష్, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

### నూతన చేయూత పింఛన్ల కొరకు

# లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలి

- చివరి తేదీ:31.08.2026
- జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్



**మెదక్, ఆగస్టు 28 (జనంసాక్షి):** చేయూత పింఛన్ల కొరకు ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త చేయూత పింఛన్లు దరఖాస్తులు మండల మరియు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని తెలిపారు. చేయూత పింఛన్ల దరఖాస్తుల సమస్యల పరిష్కారం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. పింఛన్ల కొరకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఏదైనా ధృవీకరణ పత్రం లేనియెడల వెంటనే సంబంధిత అధికారుల దగ్గరకు వెళ్లి తక్షణమే

మిగతా 3లో..

### జహీరాబాద్ ఏరియా

# ఆస్పత్రిలో వైద్యుల గైర్హాజరుపై మంత్రి ఆగ్రహం




**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీ వైద్యులు గైర్హాజరు కావడం, వారి స్థానంలో ప్రైవేట్ వైద్యుడు విధులు నిర్వహించి చికిత్స అందించిన ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించడంతో పాటు బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఆస్పత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ వైద్యుల గైర్హాజరు, ప్రైవేట్ వైద్యుడితో చికిత్స అందించిన ఘటనకు సంబంధించిన వార్తా కథనాలపై మంత్రి స్పందించారు. ఈ విషయమై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మంత్రి మాట్లాడారు.

జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో జరిగిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డ్యూటీ వైద్యుడు విధులకు గైర్హాజరై ఆయన స్థానంలో ప్రైవేట్ వైద్యుడు విధులు నిర్వహించడం పట్ల మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన ప్రభుత్వ డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

# వీధి వ్యాపారులకు అండగా ఉంటాం..

- షాపుల తొలగింపుతో మున్సిపాలిటీకి సంబంధం లేదు
- ఎన్‌హెచ్ఏఐ నిర్ణయంతోనే తొలగింపు ప్రక్రియ
- బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేయడం సరికాదు
- చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్






**కల్వకుర్తి,ఆగస్టు 28 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ చౌరస్తాలో వీధి వ్యాపారుల షాపుల తొలగింపు వ్యవహారంతో మున్సిపల్ పాలకవర్గానికి ఎలాంటి సంబంధం లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం వైస్ చైర్మన్ షానవాజ్‌ఖాన్‌తో కలిసి నాగర్‌కర్నూల్ చౌరస్తాను సందర్శించిన ఆమె వీధి వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైవే విస్తరణలో భాగంగా జాతీయ రహదారి పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించాలని నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్ఏఐ) నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే వీధి వ్యాపారుల షాపుల తొలగింపు చేపట్టారని తెలిపారు. ఈ నిర్ణయం మున్సిపల్ పాలకవర్గం తీసుకున్నది కాదని స్పష్టం చేశారు.

రాజకీయాలు చేయొద్దువీధి వ్యాపారుల సమస్యను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు అనవసర రాజకీయాలు చేయడం సరికాదని రత్నమాల అన్నారు. పదేళ్లపాటు మున్సిపాలిటీలో పదవులు అనుభవించిన బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను తెలుసుకోకుండా మున్సిపాలిటీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రత్యామ్నాయం చూపిస్తాంతాను ఎల్లప్పుడూ పేదల పక్షాన ఉంటానని చైర్‌పర్సన్ తెలిపారు. వీధి వ్యాపారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయం చూపించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వ్యాపారులు ఆందోళన చెందవద్దని, మున్సిపల్ పాలకవర్గం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ ఏజాస్, కొల్లోజు రాజేష్‌కుమార్, నాజియా మక్బూల్, చిత్తారి ఎల్లమ్మ శ్రీనివాసులు, రమాకాంత్‌రెడ్డి, గణేష్‌యాదవ్,కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడుయాహియాఖాన్, నాయకులు పడకంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రక్షణ కరువు

- కోతులమయమైన పిహెచ్‌సి సెంటర్
- హెల్త్ ఆఫీసర్, సిబ్బంది నిర్లక్ష్యం రోగులపాలిట శాపంగా మారిన వైనం





**నంగునూరు, ఆగస్టు 28 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్సి) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం వందలాది మంది రోగులకు వైద్య సేవలు అందించాల్సిన ఈ ఆసుపత్రికి కనీస రక్షణ కరువైందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఆరోగ్య కేంద్రం కిటికీల అద్దాలు పగిలిపోవడంతో ఆసుపత్రి ప్రాంగణం మొత్తం కోతుల మయంగా మారింది. కోతులు గుంపులు గుంపులుగా ఆసుపత్రిలోకి ప్రవేశించి, వార్డుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో చికిత్స కోసం వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు కోతుల దాడి భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ఆసుపత్రిలోని మందులు, రికార్డులను సైతం కోతులు నాశనం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.
మరోవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం రోగుల పాలిట శాపంగా మారిందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో కనీస పారిశుధ్యం లోపించిందని, కిటికీలు విరిగిపోయి కోతులు లోపలికి వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ప్రజలు మండిపడుతున్నారు. వైద్యం కోసం వచ్చి కొత్త రోగాలను కొని తెచ్చుకోవాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే గట్ల మల్యాల పి.హెచ్.సికి తగిన రక్షణ కల్పించాలని, కిటికీలను పునరుద్ధరించి కోతుల నుండి కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ

- జోరుగా సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు
- గ్రామ సర్పంచ్ పుట్ల గళ్ళ మోహన్





**కొల్చారం, ఆగస్టు 28(జనంసాక్షి):** అర్హులైన ప్రతి వారికి ఇందిరమ్మ ఇల్లు వస్తాయని గ్రామ సర్పంచ్ పుట్ల గళ్ళ మోహన్ అన్నారు. శుక్రవారం కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామంలో అందనగరం శాంతమ్మ సుదర్శనం ఆకుల వనిత శ్రీనివాస్ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సర్పంచ్ ఆధ్వర్యంలోభూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, మాజీ ఎంపీటీసీ తుడుము రామకృష్ణ, గ్రామ పెద్దలు కమ్మరి పాండరీ, వడ్ల వెంకటేశం, వడ్ల చంద్రం గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాక్షాబంధన్‌తో బలపడుతున్న బంధాలు



**రాజాపూర్, ఆగస్టు 28(జనంసాక్షీ):** రాఖీ పూర్ణిమ సందర్భంగా రక్షాబంధన్ కార్యక్రమం ప్రతి ఇంటిలో అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ళు రాఖీలు కట్టి తమ రక్తసంబంధాన్ని, బంధుత్వాన్ని భావితరాలకు తెలియజేశారు. ఎక్కడ ఉన్నా బయటి దేశంలో ఉన్న తమ్ముడు కోసం అక్క, చెల్లి కోసం అన్నా వచ్చి రాఖీ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. ఉమ్మడి కుటుంబంలో అందరూ కలిసి మెలిసి రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

# నిఘా నేత్రాలు నిద్రలో.. చోరీలు జోరులో!

- గాదిర్యాల్,చౌదర్పల్లిలో వరుస చోరీలు..
- ట్రాక్టర్ బ్యాటరీలు,సెల్ఫ్ మోటార్లు,డీజిల్ మాయం..
- లక్షలు ఖర్చు చేసిన నిఘా కెమెరాలు పనిచేయవు..
- గ్రామ భద్రతపై సర్పంచుల నిర్లక్ష్యమే కారణమా?

**మహమ్మదాబాద్, ఆగస్టు 28 (జనంసాక్షి):** చీకటి పడితే చాలు.. దొంగలు రెచ్చిపోతున్నారు. గ్రామాల్లో నిఘా కెమెరాల నిఘా లేకపోవడంతో రైతుల కష్టార్జితం,వ్యవసాయ పరికరాలకు రక్షణ కరువైంది. మండలంలోని గాదిర్యాల్, చౌదర్పల్లి గ్రామాల్లో గుర్తుతెలియని దుండగులు వరుసగా చోరీలకు పాల్పడుతుండటంతో రైతులు, ట్రాక్టర్ యజమానులు బెంబేలెత్తుతున్నారు. పగలంతా పొలాల్లో కష్టపడి పనిచేసి రాత్రివేళ ట్రాక్టర్లను పొలాల వద్ద నిలిపి ఇంటికి వెళ్లిన రైతులను దుండగులు టార్గెట్ చేస్తున్నారు. ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు,సెల్ఫ్ మోటార్లు,డీజిల్‌ను ఎత్తుకెళ్తున్నారు. గాదిర్యాల్ గ్రామంలో రెండు ట్రాక్టర్లకు సంబంధించిన సెల్ఫ్ మోటార్లు, బ్యాటరీలను, ఇదే సమయంలో ట్రాక్టర్లలో నిల్వ చేసిన డీజిల్‌ను కూడా దొంగలు వదలడం లేదు.సుమారు రూ.6,వేల విలువైన డీజిల్ చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ.15వేల విలువైన బ్యాటరీలు, ఇతర వ్యవసాయ పరికరాలు చోరీకి గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. చౌదర్పల్లి గ్రామంలోనూ ఓ ట్రాక్టర్ బ్యాటరీని దుండగులు అపహరించినట్లు సమాచారం.వరుస చోరీలు జరుగుతున్నా దుండగుల ఆచూకీ లభించకపోవడంతో బాధితుల్లో ఆందోళన నెలకొంది..

**కెమెరాలు ఉన్నా..నిఘా ఏదీ? గ్రామాలలో సర్పంచుల నిర్లక్ష్యం..**

మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజల భద్రత కోసం గతంలో లక్ష రూపాయలతో, నిఘా కెమెరాలు ఏర్పాటుచేశారు. పంచాయతీ పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టిన తర్వాత కెమెరాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.చోరీలు,అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కీలకమైన నిఘా కెమెరాలు పనిచేయకపోవడంతో గ్రామాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.ప్రజాధనంతో ఏర్పాటు చేసిన కెమెరాలను మరమ్మతులు చేయించి నిరంతరం పనిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

**రోడ్డుపక్కనే నిలబెట్టిన ట్రాక్టర్‌కు బ్యాటరీ మాయం..**



నిత్యం ప్రజలు తిరుగుతున్న స్థలాలలో వరుస చోరీలకు పాల్పడుతున్నారు. గాదిర్యాల్ గ్రామానికి చెందిన, మున్యనోళ పాండు అనే వ్యక్తి గత వారం రోజుల క్రితం పొలం పనులు ముగించుకొని, తెలిసినవారికి ఇంటికాడ రోడ్డు పక్కనే ట్రాక్టర్ ను నిలబెట్టడంతో గురుతు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ట్రాక్టర్‌కు సెల్ఫ్ మోటర్, బ్యాటరీ, ఎత్తుకెళ్లారు. నిత్యం ప్రజలు తిరిగే ప్రాంగణాలలో కూడా ఇలాంటి చోరీలు జరగడం విచిత్రకరమైన విషయం అని అన్నారు.పోలీసులు ప్రత్యేక నిఘపెట్టి దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

**- బాధితుడు మున్యనోళ పాండు,గాదిర్యాల్ గ్రామం**

**చోరీలకు పాల్పడుతున్న దుండగులను పట్టుకుంటాం...**



రాత్రి వేళల్లో పొలాల వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్ల బ్యాటరీలు, డీజిల్ చోరీలకు పాల్పడుతున్న దుండగులను ఎట్టి పరిస్థితుల్లోనూ పట్టుకుంటామని ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న వరుస చోరీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రైతులు తమ ట్రాక్టర్లను పొలాల వద్ద నిలిపి ఉంచే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు,వాహనాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

**- మహమ్మదాబాద్ ఎస్ఐ,శేఖర్ రెడ్డి**

## రాఖీ పండగ సోదరభావానికి ప్రతీక...

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సదాశివపేట, ఆగస్టు 28(జనంసాక్షి):** రాఖీ పండగ సోదరభావం, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం రక్షాబంధన్ సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో కుటుంబ సభ్యులు ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రతి కుటుంబం ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## కేఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్‌కు మాతృవియోగం



**చేర్యాల, ఆగస్టు 28 (జనంసాక్షి):** మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన కేఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ కరెడ్ల రాజేశ్వర్ రెడ్డి తల్లి ప్రమీల (85) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరై పార్థివ దేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించి ఓదార్చారు. ఆమె మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి భర్త రిటైర్డ్ హెచ్ఎం రాంరెడ్డి గత కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందారు. మృతురాలికి ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## జమ్మిచెట్టు కట్ట నిర్మాణానికి ముందుకు దాతలు



**కృష్ణ, ఆగస్టు 28 (జనంసాక్షి):** కృష్ణ మండలం గుడేబల్లూర్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవలయం దగ్గర ఉన్న జేమ్మిచెట్టు చుట్టూ ఉన్న కట్ట పూర్తిగా శితిలా వస్తుకు చేరింది. దానిని పూర్తిగా తొలగించి కొత్త కట్టను నిర్మించడానికి ధాత ముస్కా వెంకటేష్ ముందు కు వచ్చారు. చేయూతగా మాజీ ఎంపిటిసి వాకిటి నారాయణ ఒక టిప్పరు ఇసుక మొరం ఇవ్వడం జరిగింది.వీరిద్దరికి గ్రామ ప్రజల తరుపున అభినందనలు తెలిపారు.

## కేటిదొడ్డి పోలీస్ స్టేషన్‌లో రాఖీ పండుగ వేడుకలు



**కేటీదొడ్డి, ఆగస్టు 28(జనంసాక్షి):** కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఆత్మీయ వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ కానిస్టేబుల్ ధానేశ్వరీ ఎస్ఐ పి.శ్రీనివాసులు, తమ సహచర పోలీసు అధికారులకు, సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పోలీసు సిబ్బంది కూడా మహిళా పోలీస్ అధికారికి రాఖీ కట్టి సోదర-సోదరీ భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి. శ్రీనివాసులుకు మహిళా పోలీస్ అధికారి రాఖీకట్టి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ కుటుంబంలో ఐకమత్యం, స్నేహపూర్వక వాతావరణం మరింత బలోపే తం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

**తూప్రాన్, ఆగస్టు 28(జనంసాక్షి):** తూప్రాన్‌లో మిలాద్ ఉన్ నబి ర్యాలీ ముస్లింల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు పాటలతో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మదర్స విద్యార్థులు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## పుట్టిన ఊరిపై మమకారం.. పంచాయతీకి సీసీ కెమెరాల కానుక

- సొంతూరి భద్రతకు ఆబేద్ చేయూత మానవత్వం చాటుకున్న మహమ్మద్ అబేద్
- గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన సర్పంచ్ దయాకర్ గౌడ్



**కొల్చారం, ఆగస్టు 28 (జనంసాక్షి):** పుట్టిపెరిగిన గ్రామానికి తనవంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ అబేద్ ముందుకు వచ్చారు. గ్రామపంచాయతీ కార్యాలయ భద్రతను దృష్టిలో ఉంచుకుని తన సొంత ఖర్చుతో నాలుగు సీసీ కెమెరాలను గ్రామపంచాయతీ కార్యాలయానికి అందజేశారు. శుక్రవారం ఈ సీసీ కెమెరాలను గ్రామపంచాయతీ కార్యాలయానికి అందజేసిన మహమ్మద్ అబేద్.. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామ ప్రజలు ఆయన సేవాభావాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ దయాకర్ గౌడ్ మహమ్మద్ అబేద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వికలాంగుల పింఛన్ హామీ అమలు చేయాలి



**సంగారెడ్డి, ఆగస్టు 28(జనంసాక్షి):**
వికలాంగుల పింఛన్ హామీ వెంటనే అమలు చేయాలని ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా ఇన్చార్జ్ విఎస్ రాజు మాదిగ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి అంబేద్కర్ భవన్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కన్వీనర్ దేవరంపల్లి అశోక్ అధ్యక్షతన కేక్ కట్ చేసి, సంఘం జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా ఇంచార్జ్ వి.ఎస్. రాజు మాదిగ మాట్లాడుతూ... వికలాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు విద్య, ఉపాధి, సామాజిక భద్రతతో పాటు సంక్షేమ పథకాల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని కోరారు. హక్కుల సాధన కోసం భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బుచ్చంద్ర మాదిగతో పాటు వి.హెచ్.పి.ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఎం.ఆర్.పి.ఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రెండు పడక గదుల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- సిద్దిపేట కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి):**
రెండుపడక గదుల నిర్మాణ ప్రక్రియ గూర్చి గృహనిర్మాణ మరియు ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు.
**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..**
జిల్లాలో ఆయా మండలాల వారిగా నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాలను సమీక్షిస్తూ, నిర్మాణంలో ఉన్న ఇండ్లను కాంట్రాక్టర్ తో చర్చించి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే కాంట్రాక్టర్ పే-మెంట్ సైతం సకాలంలో అందించాలని తెలిపారు. నిర్మాణం పూర్తైన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అసలైన లబ్ధిదారులకు అందించి ఆ ఇండ్లను ప్రారంభానికి సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో రెండు పడక గదులను లబ్ధిదారులకు అందించిన ఇండ్లకు ఎలక్ట్రిసిటీ, తాగునీటి వసతి, సిసి రోడ్లు, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రెండు పడక గదులు గృహాలు పూర్తి చేసేందుకు గృహ నిర్మాణ శాఖ, ఆయా ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గృహ



నిర్మాణశాఖ పిడి భగవంత్ రావు, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, ఈడబ్ల్యూఐడిసి ఈఈ శ్రీనివాస్ రెడ్డి, అర్ అండ్ బీ, డిఈ లు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్లకు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి: అదనపు కలెక్టర్ పాండు

- అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 28(జనంసాక్షి):**
చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం-2026 కింద అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ పాండు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో పెన్షన్లకు సంబంధించిన పోస్టర్, బ్యానర్, కరపత్రాలను అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకిరెడ్డి, డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యారావుతో కలిసి ఆవిష్కరించారు.
**ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ...** వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, రక్త సంబంధిత దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత పింఛన్లు అందిస్తోందన్నారు.
**అర్హతలు....**
వితంతువులు 18 ఏళ్లు పైబడి ఉండి భర్త మరణ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి. భర్తతో విడిపోయి లేదా వదిలివేయబడి కనీసం ఏడాది పూర్తయిన 18 ఏళ్లు పైబడిన ఒంటరి మహిళలు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో 30 ఏళ్లు, పట్టణ ప్రాంతాల్లో 35 ఏళ్లు పైబడిన అవివాహిత మహిళలు కూడా అర్హులని తెలిపారు.
దివ్యాంగులకు వయోపరిమితి లేకుండా, సదరం లేదా ప్రత్యేక గుర్తింపు ధృవీకరణ ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉన్నవారు అర్హులు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా బాధితులకు కూడా ధృవీకరణ ఆధారంగా పింఛన్ మంజూరు చేస్తారు.
కల్లుగీత కార్మికులు 50 ఏళ్లు పైబడి, సంబంధిత సహకార సంఘ సభ్యత్వంతో పాటు ఎక్సైజ్ శాఖ ధృవీకరణ కలిగి ఉండాలి. చేనేత కార్మికులు 50 ఏళ్లు పైబడి, చేనేత-జౌళి శాఖ ధృవీకరణ కలిగి ఉండాలి. గ్రేడ్-2, గ్రేడ్-3 ఫైలేరియా బాధితులు కూడా అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, పురపాలక కమిషనర్ల వద్ద దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. అలాగే చేయూత అధికారిక వెబ్‌సైట్‌లోని దరఖాస్తు ఫారాలను పొందవచ్చన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. మహిళా సమాఖ్యల సహకారంతో అర్హులైన మహిళలకు దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన ధృవపత్రాల విషయంలో సహాయం అందించాలని సూచించారు.

## నూతన చేయూత పింఛన్ల కొరకు లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలి

తీసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకునేటప్పుడు ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే కలెక్టరేట్లో ఉన్న హెల్ప్‌డెస్క్ సహాయకారిణిగా పనిచేస్తుందని, సమస్య ఉన్నట్లయితే వెంటనే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలన్నారు. అర్హులైన వారు త్వరితగతిన దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు.

## శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి



**మల్దకల్,ఆగస్టు 28 (జనంసాక్షి):** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ చేయనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థపతి వల్లి నాయగన్, డీఈఈ ఓం ప్రకాష్,ఈఈ రణవీర్,అసిస్టెంట్ స్థపతి సంజీవ్ తెలిపారు. శుక్రవారం గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాలతో శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయంను వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థపతిగారికి స్వామివారి శేష వస్త్రం తీర్థప్రసాదాలు చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్ర మంలో సహాయ స్తపతి సంజయ్, ఏఈ, అర్చకులు మధు సూదనాచారి, రమేష్, శశాంకదాస్, చంద్రశేఖరరావు, చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవతో సృజన లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి



**అమీన్పూర్, ఆగస్టు 28 (జనంసాక్షి):**
సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ చొరవతో బీరంగూడ సిఎంసి డివిజన్ పరిధిలోని సృజన లక్ష్మీనగర్ కాలనీలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో శశిధర్ రెడ్డి శుక్రవారం అధికారులతో కలిసి సృజన లక్ష్మీ నగర్ కాలనీలో పర్యటించి రోడ్లను పరిశీలించారు. త్వరలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం కానున్నందున పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి కాలనీవాసులకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు.
ప్రభుత్వం కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మంత్రి వివేక్ వెంకటస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కరెడ్ల ప్రమీల మృతి పట్ల ప్రముఖుల నివాళులు..



**చేర్యాల, ఆగస్టు 28(జనంసాక్షి):** కెఆర్ఆర్ ట్రస్టు చైర్మన్ కరెడ్ల రాజేశ్వర్ రెడ్డి తల్లి, గ్రామ మాజీ ఎంపీటీసీ కరెడ్ల రాంరెడ్డి సతీమణి ప్రమీల (85) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆమె భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించిన జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, ఆకునూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల రాజు, మాజీ సర్పంచ్ కరెడ్ల మాధవరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ జంబుల వెంకట్ రెడ్డి, బోయిని రాజు, వెలగల రఘువీర్, అనుముల సిద్దారెడ్డి, జూపల్లి కార్తీక్ రెడ్డి, కడారి నరేష్, పౌడల హరికృష్ణ తదితరులు నివాళులర్పించి తన కుమారుడు కరెడ్ల రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించి మనోధర్యం చెప్పారు. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# ఆటో కార్మికుల సమస్యల సాధనకు కృషి చేస్తా

- ఏఐటీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షులు పాల సాయిలు
- పాల సాయిలును సన్మానించిన ఏఐటీయూసీ బృందం



**చేర్యాల, ఆగస్టు 28 (జనంసాక్షి):** ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత కొంతకాలంగా కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ఆకునూరు గ్రామ భారత్ ఆటో యూనియన్ అధ్యక్షులు పాల సాయిలును చేర్యాల మండలంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సంఘం నాయకులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు అందె అశోక్ మాట్లాడుతూ.. ఆకునూరు గ్రామ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సేవలు అందిస్తున్న పాల సాయిలును చేర్యాల మండల ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడాలని సూచించారు. ఈ సందర్భంగా పాలసాయిలు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయిన ప్రతి ఆటో కార్మికుడికి నెలకు రూ.12 వేలు జీవన భృతి చెల్లించాలని, ప్రమాదవశాత్తు మరణించిన ఆటో కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలను రద్దు చేయాలని, ప్రతి పట్టణం, మండలం, గ్రామంలో ఆటో కార్మికులకు హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేయాలని, ప్రతి ఆటో కార్మికుడికి పాత పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ తరపున జేఏసీకి పెద్దన్న పాత్ర పోషించి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో చర్చలు జరిపారు. క్యాబినెట్ లో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సెప్టెంబర్ 1న అధికారిక ప్రకటన చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు ఆగస్టు 24న తలపెట్టిన ఆటో బంద్ ను విరమించుకున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని అన్నారు. భవిష్యత్తులో ఆటో కార్మికులకు ఏ సమస్య వచ్చిన అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు కర్రె ఆంజనేయులు, ఈరి భూమయ్య, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, పోషబోయిన పరమశేఖర్, బియ్య బాలరాజు, మనెపల్లి కిష్టయ్య, సిద్దిరాం భద్రయ్య, నంగి సత్తయ్య, ఎగుర్ల ఎల్లయ్య, చేర్యాల యాదయ్య పాల్గొన్నారు.

## నూతన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఘన సన్మానం



**మెదక్ టౌన్, ఆగస్టు 28, (జనంసాక్షి):** మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస.న. చారి మరియు ప్రధాన కార్యదర్శి బి.సంగమేశ్వర్‌లను మెదక్ నియోజకవర్గంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మెదక్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ గారు, నర్సాపూర్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ అపర్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, లిప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## కోహెడ మండలం కేంద్రంలో ఘనంగా కర్ర శ్రీహరి 83వ జయంతి వేడుకలు



**కోహెడ, ఆగస్టు 28 (జనంసాక్షి):** మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కీ.శే.కర్ర శ్రీహరి 83వ జయంతి వేడుకలను బిఆర్ఎస్ పార్టీ కోహెడ శాఖ ఆధ్వర్యంలో కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొక్కుల సురేష్, బీ ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెరుగు నరేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పొన్నాల లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పారపు శ్రీకాంత్, బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఆవుల మహేందర్ ,కోహెడ మండల సర్పంచులఫోరం అధ్యక్షులు చంద్రారెడ్డి, బీ ఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు ఓవైజ్, కర్ర శ్రీహరి అభిమానులు తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## మెదక్‌లో ఐటీఐ ప్రవేశాలకు మూడో విడత వాక్-ఇన్ అడ్మిషన్లు






**మెదక్ టౌన్ ఆగస్టు 28 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (గవర్నమెంట్. ఐటిఐ), తెలంగాణా మోడల్ ప్రభుత్వ ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు (ఏటీసీ), ప్రైవేట్ ఐటీఐల్లో 2026-27 విద్యా సంవత్సరానికి మూడో దశ వాక్-ఇన్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఉపాధి మరియు శిక్షణ శాఖ ప్రకటించింది. అధికారిక ఐటీఐ వెబ్‌సైట్‌లోనూ మూడో దశ వాక్-ఇన్ ప్రవేశాలకు ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 5, 2026 వరకు తేదీలు ప్రకటించారు. అభ్యర్థులు ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 5 వరకు సంబంధిత ఐటీఐల్లో నేరుగా హాజరై ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 10వ తరగతి, కొన్ని ట్రేడ్లకు 8వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. అభ్యర్థుల కనీస వయస్సు 14 సంవత్సరాలు ఉండాలి. వాక్-ఇన్ సమయంలో అభ్యర్థులు తమ విద్యార్హత, గుర్తింపు తదితర ధ్రువపత్రాలతో హాజరు కావాలి. ఖాళీ సీట్ల ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయించనున్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రభుత్వం ఐటిఐ ప్రిన్సిపాల్ జిల్లా కన్వీనర్ ఈ అవకాశం సద్వినియోగ పరచుకోగలను కోరినారు

## నూలు పౌర్ణమి సందర్భంగా శ్రీ మార్కండేయ స్వామి శోభాయాత్ర

**కోహెడ, ఆగస్టు 28 (జనంసాక్షి):** మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో శుక్రవారం నూలు పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామంలోని పద్మశాలి కుల బాంధవుల ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ స్వామి శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ చేనేత వృత్తి విశిష్టతను తెలియజేస్తూ శ్రీ మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గ్రామ ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. చేనేత కళ, పద్మశాలి కుల బాంధవుల సాంప్రదాయ వారసత్వం అలాగే మగ్గం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలు శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షులు వడ్డేపల్లి బాలయ్య, ఉపాధ్యక్షులు కొండ రాజేశం, ఉప్పరపల్లి సదానందం, పోలు కాశీరాం, పోలు సత్తయ్య, చిప్ప ధర్మపురి బూర రాజేశం, పూజారులు వేముల వీరస్వామి,సకినాల రాజు, వేముల శ్రీధర్,గాజుల రాకేష్, నవీన్, సాయిరాజ్ పద్మశాలి కుల బాంధవులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మాజీ మస్కూరీ బోయిని రామయ్య మృతి



**చేర్యాల, ఆగస్టు 28(జనంసాక్షి):** మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన మాజీ మస్కూరీ (వీఆర్ఏ) బోయిని రామయ్య (100) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామంలో అనేక సంవత్సరాలుగా మస్కురిగా సేవలందించారు. ఆయన మృతి పట్ల గ్రామస్తులు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతునికి నలుగురు కుమారులు ఉన్నారు.

# కాపర్ దోపిడీ కేసులో ఒకరి అరెస్ట్

- రూ.1.13 కోట్ల విలువైన కాపర్ ముడి పదార్థం స్వాధీనం




**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి):** కాపర్ ముడి పదార్థం దోపిడీ కేసును సంగారెడ్డి జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేసి రూ.1.13 కోట్ల విలువైన కాపర్ ముడి పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్, మునిపల్లి, సదాశివపేట పోలీసులను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు. ఈ నెల 18,19వ తేదీ అర్ధరాత్రి హైదరాబాద్ బోలక్‌పూర్‌లోని సన్‌లైట్ మెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి ముంబైకి తరలిస్తున్న కాపర్ ముడి పదార్థంతో కూడిన ఈచర్ వాహనాన్ని మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-65పై నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించారు. డ్రైవర్ సైఫూన్‌ను కత్తులతో బెదిరించి కారులోకి ఎక్కించుకుని ఆరూర్ ప్రాంతంలో వదిలివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వాహనంలోని జీపీఎస్ ఆధారంగా తెల్లవారుజామున 4.30 గంటలకు ఆరూర్ వద్ద ఈచర్ వాహనాన్ని గుర్తించారు. వాహనాన్ని తనిఖీ చేయగా 171 బ్యాగులకు గాను 48 బ్యాగుల్లో మాత్రమే కాపర్ ముడి పదార్థం ఉండగా, 123 బ్యాగులు దోపిడీకి గురైనట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.1.13 కోట్లు.

ఫిర్యాదు మేరకు మునిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ఆదేశాలతో సీసీఎస్, మునిపల్లి, సదాశివపేట పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలు, వాహనాల కదలికలు, టోల్‌గేట్ సమాచారాన్ని విశ్లేషించారు.

ఈ క్రమంలో ఈ నెల 27న అనుమానిత డీసీఎం వాహనం కంకోల్ టోల్‌గేట్ దాటి జహీరాబాద్ వైపు వెళ్తున్నట్లు గుర్తించిన పోలీసులు దిగ్వాల్ గ్రామం సమీపంలో వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న లిలిషేక్ సబీర్ షరీఫ్ (26)లిలిను అదుపులోకి తీసుకుని విచారించారు.

విచారణలో సబీర్ తన ప్రమేయాన్ని వెల్లడించడంతో పాటు ప్రధాన నిందితుడు సోహెల్‌తో పాటు మరో 10 నుంచి 11 మంది ఈ దోపిడీలో పాల్గొన్నట్లు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. దోపిడీ చేసిన కాపర్‌ను తరలించేందుకు డీసీఎం, అశోక్ లేలాండ్ వాహనాలను ఉపయోగించినట్లు తెలిపాడు.

అతడి సమాచారం మేరకు పోలీసులు దోపిడీకి గురైన 123 బ్యాగుల కాపర్ ముడి పదార్థాన్ని, నల్లటి టార్పాలిన్ కవర్‌ను, రెండు వాహనాలతో పాటు దోపిడీకి గురైన ఈచర్ వాహనాన్ని, అందులో మిగిలిన 48 బ్యాగుల కాపర్ ముడి పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు.

సాంకేతిక ఆధారాలను ఉపయోగించి వేగంగా స్పందించడం, వాహనాల కదలికలను పర్యవేక్షించడం, టోల్‌గేట్ సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా కేసును ఛేదించిన పోలీసు బృందాలను ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు. మిగిలిన నిందితులను కూడా త్వరలో పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్‌కు రాఖీ కట్టిన సోదరీలు



**మెదక్, ఆగస్టు 28 (జనంసాక్షి):** రాఖీ పండుగను పురస్కరించుకుని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్‌కు ఆయన సోదరీలు శుక్రవారం రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదర, సోదరీమణుల మధ్య ఉన్న ఆత్మీయత, అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. మల్లికార్జున్ కూతురు సుధీక్షిత సోదరులైన అభిరామ్ గౌడ్, అశ్విత్ గౌడ్, సాయి చైతన్యలకు రాఖీలు కట్టారు. ఇలా కుటుంబమంతా రాఖీ పండుగ సంబరాలు నెలకొన్నాయి. ఈ రాఖీ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలను , ఆయురారోగ్యాలను నింపాలని వారు ఆకాంక్షించారు.

## కొత్త పింఛన్ల దరఖాస్తుకు ఈనెల 31 చివరి గడువు

• సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 28(జనంసాక్షి): చేయూత పథకం కింద కొత్త సామాజిక భద్రతా పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 31వ తేదీ చివరి తేదీ అని అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి జిల్లా ప్రజలకు తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి శాఖ వారు జారీచేసిన చేయూత సామాజిక భద్రత కొత్త పెన్షన్ల మంజూరు-2026 సంబంధించి గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత/చేనేత కార్మికులు, రక్తసంబంధిత దివ్యాంగులు, ఫైలేరియా వ్యాధి ద్వారా బాధపడేవారికి చేయూత అందించడం కోసం కొత్త పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారిక వెబ్సైట్ లో దరఖాస్తు స్వీకరణ గడువు చివరి తేదీ ఆగస్టు 31 ముగుస్తుందని తెలిపారు. ఆన్లైన్ లో అప్లై చేసుకున్న దరఖాస్తులను గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీఆర్డీఓ రమేష్, అడిషనల్ డీఆర్డీఏ సుధీర్, తదితరులు ఉన్నారు.

## రక్షాబంధన్ రాఖీ ఆత్మీయత రక్షణ కవచం



తూప్రాన్, ఆగస్టు 28 (జనంసాక్షి): అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు, రక్షణకు రాఖీ పౌర్ణమి ప్రతీక అని సోదరి తన సోదరుడి క్షేమాన్ని, సంతోషాన్ని కోరుకుంటూ రాఖీ కట్టడం, ఆమెకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని సోదరుడు భరోసా ఇవ్వడమే ఈ పండుగ విశిష్టత అని తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా తూప్రాన్‌లో రాఖీ పండుగ జరుపుకోవాలని కెనడా నుంచి ఇండియా వచ్చిన దంతేపల్లి నాగరాజు నివాసంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంతో ప్రేమతో అన్నయ్యకి రాఖీలు కట్టడానికి వచ్చిన సోదరీమణులు ఆయనకు ఆప్యాయంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



అల్లాదుర్గం ఆగస్టు 28 (జనంసాక్షి): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆప్యాయతలకు ప్రతీక అయినా రాఖీ పండుగ వేడుకలు శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పుట్టింటి నుండి మెట్టినింటికి వెళ్లిన చెల్లెల్లు, అక్కలు, అన్నలకు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి ఈ బంధం జన్మజన్మల కొన సాగాలని దేవుని కోరుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా ఆయా గ్రామాలలో అక్క, చెల్లెల్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంలో రాఖీ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. అన్నదమ్ములకు అక్క చెల్లెలులు రాఖీలు కట్టి తిలకం దిద్ది మిఠాయిలు తినిపించారు. ఇలాగే కలకాలం సంతోషంగా ఉండాలని కోరుతూ రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

## రాఖీతో బంధం.. ప్రేమతో అనుబంధం!

• అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా రక్షాబంధన్...



మహమ్మదాబాద్,ఆగస్టు 28(జనంసాక్షి): అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు మహమ్మదాబాద్ మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని,సోదరులు,సోదరీమణులు పరస్పరం రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.గాదిర్యాల్ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.

## శ్రీరంగాపూర్‌లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



శ్రీరంగాపూర్, ఆగస్టు 28 (జనంసాక్షి): రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరంగాపూర్ మండలంలో రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, వారి క్షేమం కోసం ప్రార్థించారు. అనంతరం సోదరులు తమ సోదరీమణులకు జీవితాంతం అండగా ఉంటామని హామీ ఇచ్చి కానుకలు అందించారు.

# అకాడమిక్ క్యాలెండర్‌లో నర్మెట విద్యార్థుల ఫోటో

• సిద్దిపేట జిల్లా విద్యా ప్రగతికి దక్కిన అరుదైన గుర్తింపు




నంగునూరు, ఆగస్టు 28(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం-విద్యాశాఖ ప్రచురించిన అకాడమిక్ క్యాలెండర్‌లో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల ఫోటో చోటు చేసుకుంది. నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఆవరణలో గత మార్చి నెలలో రాష్ట్ర అభివృద్ధిని తెలిపే మేళా నిర్వహించారు. ఈ మేళాలో విద్యాశాఖ ప్రగతిని తెలిపే స్టాల్ ను జిల్లా విద్యా శాఖ ఏర్పాటు చేసింది. ఈ స్టాల్‌ను నర్మెట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిర్వహించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాల మేళాను సందర్శించారు. విద్యాశాఖ స్టాల్‌వద్ద నర్మెట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారితో ఆత్మీయంగా ఫోటో దిగారు. ఈ ఫోటోను రాష్ట్ర విద్యా శాఖ రూపొందించిన అకాడమిక్ క్యాలెండర్‌లో మార్చి నెల పేజీలో ప్రచురించడం విశేషం. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి విద్యా క్యాలెండర్‌లో తమ పాఠశాల విద్యార్థులతో ముఖ్యమంత్రి మాట్లాడిన దృశ్యం ప్రచురితం కావడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ పేర్కొన్నారు. సాధారణంగా రాష్ట్ర స్థాయి ప్రచురణల్లో ఒక చిన్న గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన ఫోటో చోటు చేసుకోవడం అరుదైన విషయమని ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ అన్నారు. తమ పాఠశాలకు ఈ అవకాశం లభించడం ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు. ముఖ్యమంత్రి విద్యార్థులు, తల్లి దండ్రులతో మమేకమైన ఆ క్షణాన్ని విద్యా శాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరచడం ద్వారా నర్మెట పాఠశాల ప్రత్యేకత రాష్ట్ర స్థాయిలో ప్రతిబింబించిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా వాతావరణం, పాఠశాల-తల్లి దండ్రుల అనుబంధం, విద్యార్థుల భాగస్వామ్యం వంటి అంశాలకు ఈ ఫోటో ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. తమ పాఠశాల ఫోటో రాష్ట్ర విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో ప్రచురితమైందన్న విషయం విద్యార్థుల్లోనూ ఉత్సాహాన్ని నింపిందని మనీష్ కుమార్ తెలిపారు. "మన పాఠశాల ఫోటో రాష్ట్రస్థాయి క్యాలెండర్‌లో రావడం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు, తల్లిదండ్రికి గర్వకారణం. ముఖ్యమంత్రి విద్యార్థులతో ముచ్చటించిన ఆ మధుర జ్ఞాపకం ఇప్పుడు అకాడమిక్ క్యాలెండర్ ద్వారా శాశ్వత గుర్తింపుగా నిలిచింది" అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నర్మెట వంటి గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఫోటో రాష్ట్ర విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో చోటు దక్కడం సిద్దిపేట జిల్లా విద్యారంగానికి, నంగునూరు మండలానికి, నర్మెటకి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ గుర్తింపు పాఠ శాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు ప్రేరణ ఇస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

# దైవ దర్శనానికి వెళ్లి గుండెపోటుతో ఏ.ఎస్సై కన్నయ్య మృతి



గద్వాల నడిగడ్డ,ఆగస్టు 28(జనంసాక్షి); జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఏ.ఎస్సై కన్నయ్య అకస్మాత్తుగా మృతి చెందడం పట్ల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం తెలిపారు.

శాంతినగర్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రస్తుతం జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ.ఎస్సై కన్నయ్య గురువారం రాత్రి తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లి, మొక్కు తీర్చుకునే క్రమంలో మెట్ల మార్గం గుండా కాలినడకన కొండపైకి వెళ్తుండగా, ప్రయాణం చివరి దశలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందారు.

1989 బ్యాచ్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన కన్నయ్య, తన సుదీర్ఘమైన 37 సంవత్సరాల 8 నెలల పోలీసు సేవలో హెడ్ కానిస్టేబుల్‌గా, అనంతరం ఏ.ఎస్సైగా పదోన్నతులు పొందుతూ వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విశేష సేవలు అందించారు. తన విధుల్లో నిబద్ధత, సౌమ్యత, బాధ్యతాయుతమైన పనితీరుతో ఉన్నతాధికారులు, తోటి పోలీసు సిబ్బంది, ప్రజల మన్ననలు పొందారు.

ప్రస్తుతం జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా ఎంతో బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ ప్రజాసేవలో కొనసాగుతున్న కన్నయ్య ఆకస్మిక మృతి అత్యంత బాధాకరమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. సుదీర్ఘకాలం పోలీసు శాఖకు అంకిత భావంతో సేవలందించిన మంచి అధికారి, మంచి మనిషిని కోల్పోవడం జిల్లా పోలీసు వ్యవస్థకు తీరని లోటు అని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ కె. శంకర్, జిల్లా పోలీసు అధికారులు, సహచర ఉద్యోగులు కన్నయ్య పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం దహన సంస్కారాల నిమిత్తం 30,000/- రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కన్నయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన సేవలను స్మరించుకున్నారు. కన్నయ్య కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, పోలీసు వ్యవస్థ తరఫున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

# స్పెషల్ బస్సుల పేరుతో దోపిడీ ఆపాలి!

• రాఖీలు కట్టించుకుని బీజేపీ వినూత్న నిరసన..
• అదనపు చార్జీలు తగ్గించాలని డిమాండ్



కల్వకుర్తి, ఆగస్టు 28(జనంసాక్షి): రక్షాబంధన్ పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులపై 'స్పెషల్ బస్సులు' పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు ప్రయాణికులతో రాఖీలు కట్టించుకుని నిరసన తెలిపారు.రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే పండుగ అని,అలాంటి పండుగ సమయంలో ప్రజలపై అదనపుచార్జీల భారం మోపడం దారుణమని నాయకులు విమర్శించారు.ప్రజలకు రక్షణగా ఉండాల్సిన ప్రభుత్వం..అదనపు చార్జీల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతోందని ఆరోపించారు.పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు బస్సులు నడపడం స్వాగతించదగ్గ విషయమేనని,అయితే 'స్పెషల్ బస్సు'పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చార్జీలను తగ్గించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు,కార్యకర్తలు,ఆర్టీసీ ప్రయాణికులు పాల్గొన్నారు.

## సర్ నోటీసులు అందిన వారు ఆందోళన చెందొద్దు.. ఎమ్మార్వో



వెల్దండ, ఆగస్టు 28 (జనంసాక్షి): ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని వెల్దండ తహసిల్దార్ బీశ్వ కార్తీక్ కుమార్ అన్నారు. వెల్దండ మండలం పలుగుతండ, శంకర్ కొండ తండాలలో సర్పంచులు రమేష్ నాయక్, రవీందర్ నాయక్‌ల అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలలో ఎమ్మార్వో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీచేసిన 16 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా సమర్పించి సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలోని 32 గ్రామపంచాయతీలో 9,140 మంది ఓటర్లకు నోటీసులు వచ్చినట్టు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు సెప్టెంబర్ 19లోపు గుర్తింపు పత్రాలు సమర్పించి సవరణ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొడిపల్లిలో ఘనంగా మిలాద్-ఉన్-నబీ ర్యాలీ





కొడిపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి): మెదక్ జిల్లా కొడిపల్లిలో మిలాద్-ఉన్-నబీ సందర్భంగా శుక్రవారం రోజు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పోలీస్ బందోబస్తు నడుమ శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్ భాయ్. రసూల్, ఖాజీ, సలావుద్దీన్, గౌస్ పాషా, మినహాజ్, ఇలియాస్, ఫక్రుద్దీన్, మక్బూల్, యాదుల్, గ్రామ యువకులు పెద్దలు పాల్గొన్నారు.

## చేర్యాల నుండి ఉప్పల్ రింగ్‌రోడ్‌కు కొత్త బస్సు సౌకర్యం



సిద్దిపేట. ఆగస్టు 28(జనంసాక్షి): చేర్యాల ప్రాంత ప్రజలు, ప్రయాణికుల రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకొని జనగామ శాసనసభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆర్టీసీ అధికారులతో చర్చించి శుక్రవారం నుంచి చేర్యాల నుండి ఉప్పల్ రింగ్ రోడ్ వరకు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఈ కొత్త సర్వీసు వల్ల చేర్యాల, పరిసర ప్రాంతాల ప్రజలకు ముఖ్యంగా ఘట్‌కేసర్‌లోని నీలిమ హాస్పిటల్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అందిస్తున్న ఉచిత వైద్యం కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి. అలాగే హైదరాబాద్‌లోని ఉప్పల్ వైపు ప్రయాణం సులభతరం కానుంది. రోజువారీ పనులు, ఉద్యోగాలు, వ్యాపారాల కోసం నగరానికి వెళ్లే వారికి గణనీయమైన ఉపశమనం లభించనుంది.

చేర్యాల్ టు ఉప్పల్ బస్సు సౌకర్యం కల్పించడం కోసం కృషి చేసిన జనగామ ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సదుపాయం వల్ల వేలాది మంది ప్రయాణికులకు సౌకర్యం కలగనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నూతన బస్సు చేర్యాలకు రావడంతో స్థానిక మున్సిపల్ పాలకవర్గం, నాయకులు స్వాగతం పలికారు.

## బండరాయిపాకుల గ్రామంలో సమస్యల వెల్లువ - పంచాయతీ కార్యదర్శి తీరుపై బీఎస్పీ ఆగ్రహం



రేవల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి): రేవల్లి మండలం బండరాయిపాకుల గ్రామంలో నెలకొన్న సమస్యలపై బీఎస్పీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం ఉదయం వనపర్తి జిల్లా బీఎస్పీ అధ్యక్షులు మిద్దె మహేష్, గ్రామ నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సమస్యలను గుర్తించారు. గ్రామంలోని మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయిందని, దీనిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణకి ఫోన్ చేస్తే ఇప్పుడు కాదు, ఇంకా టైం పడుతుందంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకు పంచాయతీ కార్యదర్శి కొమ్ముకాస్తూ విధులు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజల కోసం పని చేయని కార్యదర్శిని సస్పెండ్ చేయాలని బీఎస్పీ తరపున డిమాండ్ చేశారు.

అలాగే ఎస్సీ కాలనీలో కరెంట్ లైన్ లేదని, రాత్రి వేళల్లో మురుగు కాలువల నుండి పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయని, చాలా ఇబ్బందులు పడుతున్నామని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు యాదగిరి, నాయకులు పూర్ణం కంటి దేవేందర్, మిద్దె బాలకృష్ణ, మిద్దె చందు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలి

- విద్యార్థుల్లో భాషా, గణిత పునాది నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- ఎఫ్ఎల్ఎన్‌పై విస్తృత అవగాహన కల్పించాలి: డీఈఓ రమేష్ కుమార్




నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రతి ప్రాథమిక పాఠశాల, కాంప్లెక్స్ పాఠశాల, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ సూచించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రు లు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ సెల్ఫీ పాయింట్లు ఉపయోగపడాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ సెల్ఫీ పాయింట్ వద్ద డీఈఓ రమేష్ కుమార్ సెల్ఫీ దిగి, దానిని విద్యాశాఖ సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచే చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను బలోపే తం చేయడమే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యా ర్థుల్లో పునాది స్థాయి అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానాన్ని పెంపొందిం చేందుకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు తదుపరి తరగతుల్లో విద్యను సులభంగా అభ్యసించాలంటే ప్రాథమిక దశలోనే భాషా, గణిత సామర్థ్యాలు పటిష్టంగా ఉండటం ఎంతో అవసరమన్నారు. ఎఫ్ఎల్ ఎన్‌లో భాగంగా విద్యార్థుల వయస్సు, తరగతి స్థాయికి అనుగుణంగా నిర్దిష్ట అభ్యసన లక్ష్యాలను నిర్దేశించి, వాటిని సాధించేలా బోధనా ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు అక్షరాలను గుర్తించడం, పదాలను చదవడం, వాక్యాలను అర్థం చేసుకోవడం, తమ ఆలోచనలను వ్యక్తపరచడం వంటి భాషా సామర్థ్యాలను సాధించడంతో పాటు సంఖ్యలను గుర్తించడం, లెక్కించడం, కూడిక, తీసివేత వంటి ప్రాథమిక గణిత నైపుణ్యాలను పొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రతి ప్రాథమిక పాఠశాల, కాంప్లెక్స్ పాఠశాల, మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ప్రత్యేక సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించినట్లు డీఈఓ తెలిపారు. సెల్ఫీ పాయింట్లు కేవలం ఫోటోలు దిగే ప్రదేశాలుగా కాకుండా.. ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలు, ప్రాధాన్యత, విద్యార్థులు సాధించాల్సిన అభ్యసన సామర్థ్యాలపై అవగాహన కల్పించే వేదికలుగా ఉపయోగపడాలని సూచించారు.

జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, కార్యాలయాల వద్ద ఎఫ్ఎల్ఎన్ సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలని డీఈఓ ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయుడు సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగి, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై అవగాహన పెంపొందించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థుల భవిష్యత్ అభ్యసనానికి బలమైన పునాది ఏర్పడుతుందని డీఈఓ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

## ఆదివారం శ్రీ బంగారు మైసమ్మ బోనాలు




జడ్చర్ల, ఆగస్టు 28 (జనంసాక్షి): మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఐబి బంగ్లా సమీపంలో, 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో రేపు ఆదివారం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రతిఏటా నిర్వహించే బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులు నైవేద్యంగా బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. బోనాల మహోత్సవానికి కావేరమ్మపేటతో పాటు జడ్చర్ల పురపాలక పరిధిలోని భక్తులు, పరిసర ప్రాంత ప్రజలు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

## సోదరభావానికి ప్రతీక రక్షాబంధన్

- సిద్దిపేటలో కుల మతాలకు అతీతంగా రాఖీ వేడుకలు
- సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 28(జనంసాక్షి) : సోదరభావానికి ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తున్నది అని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో రక్షాబంధన్ పండుగ సందర్భంగా సోదరభావం మతసామరస్యం చాటుతూ సిద్దిపేట బాలసదనంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినీలతో ముస్లిం కాంగ్రెస్ నాయకులు రాఖీలు కట్టించుకున్నారు.

## అన్నా చెల్లెళ్ల అనురాగ బంధమే రక్షాబంధన్



మునిపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి): అన్నా చెల్లెళ్ల అనురాగ బంధానికి అంతులేని గౌరవం కల్పించే పండుగ రక్షాబంధన్. శుక్రవారం మునిపల్లి మండలంలో రాఖీపూర్ణిమ ఘనంగా నిర్వహించారు. అన్నయ్య క్షేమంగా ఉండాలని, అమ్మలా లాలించి, నాన్నలా ఆదరించాలని కాంక్షిస్తూ సోదరి తన అన్నదమ్ములకు రక్ష కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. రక్షాబంధన్ పండగ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు మండల ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి

- చేర్యాల మండల వ్యాప్తంగా ఘనంగా రక్షాబంధన్



చేర్యాల, ఆగస్టు 28(జనంసాక్షి): అన్న చెల్లెల ఆత్మీయ అనుబంధానికి, రక్తసంబంధాలకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి వేడుకలు శుక్రవారం చేర్యాల మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాఖీ పండుగ అనగానే అన్న చెల్లెల మధ్య ఆత్మీయ అనురాగాలు, రక్త సంబంధాలకు ప్రతీకగా నిర్వంచుకోవడం జరుగుతుందన్నారు. అన్నదమ్ములు, అక్కా చెల్లెలు రాఖీలు కట్టి ఆత్మీయ బంధాన్ని చాటుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## హరీశ్‌రావు, క్రాంతికిరణ్‌కు రాఖీ కట్టిన మాజీ జెడ్పిటిసి




సంగారెడ్డి, ఆగస్టు 28(జనంసాక్షి): రాఖీ పౌర్ణమి సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌లను మునిపల్లి మాజీ జెడ్పిటిసి పైతర మీనాక్షి సాయికుమార్ హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో కలిసి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బి ఆర్ ఎస్ మహిళా నాయకురాలు సంగారెడ్డి మాజీ జెడ్పీటీసీ సునీత మనోహర్‌గౌడ్, కంది మాజీ ఎంపీపీ సరళ పుల్లారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రవంతిరెడ్డి, టేక్మాల్ మాజీ సర్పంచ్ వరలక్ష్మి వారికి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, మాజీ జెడ్పీటీసీ మనోహర్‌గౌడ్, టేక్మాల్ మండల మాజీ పార్టీ అధ్యక్షుడు వీరప్ప, కంది మండల నాయకులు పుల్లారెడ్డి, కోహిర్ సాయి, ఆకుల భద్రప్ప, బుర్ర సురేష్, బోయిని రాజేందర్, మేతరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తోబుట్టువుగా అండగా ఉంటా.. పెద్దన్నగా పనిచేస్తా

- రాఖీ కట్టిన మహిళలకు చీరల బహూకరణ
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి




వనపర్తి బ్యూరో, ఆగస్టు28 (జనంసాక్షి): రాఖీ పౌర్ణమి సందర్భంగా వనపర్తి నియోజకవర్గం లో అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధం వెల్లివిరి సింది. నియోజకవర్గంలోని మహిళలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి రాఖీ కట్టిన మహిళలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తనకు రాఖీలు కట్టిన మహిళలందరికీ చీరలను బహూకరించారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా ఈ కార్యక్రమం కొనసాగింది. రాఖీ అనేది కేవలం ఒక దారం కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, నమ్మకం, భరోసా, బాధ్యతలకు ప్రతీక అని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మహిళలు తనపై చూపిన ఆప్యాయతను ఎప్పటికీ మరచిపోలేనని, వారి ప్రేమాభిమానాలను గౌరవంగా స్వీకరిస్తున్నా నని తెలిపారు. "మీరు నన్ను అన్నగా భావించి రాఖీ కట్టారు. ఇకపై నేను కూడా మిమ్మల్ని నా తోబుట్టువులుగా భావిస్తూ ఎల్లవేళలా అండగా ఉంటాను. మీకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా సంకోచించకుండా నా దృష్టికి తీసుకు రండి. సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను" అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి మహిళకు తోబుట్టువు గా, పెద్దన్నగా అండగా నిలుస్తానని ఆయన స్పష్టం చేశారు. మహిళల భద్రత, సంక్షేమం, గౌరవం, ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను నిర్వర్తిస్తానన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలతో కుటుంబసభ్యుడిగా మమే కమై, వారి సుఖదుఃఖాల్లో భాగస్వామిగా ఉండ టమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డి తమతో ఆప్యాయంగా మెలుగుతూ, సమస్యలను సొంత కుటుంబ సభ్యుల సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు ముందుంటున్నారని మహిళలు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తమకు చీరలు బహూక రించడం మరింత ఆత్మీయతను కలిగించిందని వారు పేర్కొన్నారు.

రాఖీ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ కార్య క్రమం వనపర్తి నియోజకవర్గంలో అన్నాచెల్లెళ్ల అనుబంధం, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది.

## కేజీబీవీ విద్యార్థినులతో డీఈఓ రమేష్ కుమార్ ఆత్మీయ కలయిక

- తాడూర్ కేజీబీవీలో ఘనంగా రాఖీ వేడుకలు
- విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన డీఈఓ




తాడూర్, ఆగస్టు 28(జనంసాక్షి): శుక్రవారం రాఖీ పండుగను పురస్కరించుకుని తాడూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో రాఖీ పండుగ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థినులు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్కు సోదరభావంతో రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినులు ఎంతో ఆప్యాయతతో రాఖీలు కట్ట డంతో డీఈఓ రమేష్ కుమార్ వారిని అభినందిం చారు. రాఖీ పండుగ యొక్క ప్రాధాన్యతను విద్యా ర్థినులకు వివరించారు. సోదరభావం, ఆప్యాయత, పరస్పర గౌరవం, కుటుంబ విలువలను పెంపొం దించడంలో ఇటువంటి పండుగలు ఎంతో ముఖ్యమైనవని, విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

రాఖీ వేడుకల అనంతరం డీఈఓ రమేష్ కుమార్ విద్యార్థినులతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటిం చారు. వారి చదువుకు సంబంధించిన విషయా లను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతులు, భోజ నం తదితర అంశాలపై వివరాలు తెలుసు కున్నారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించా లని సూచించారు.

విద్యార్థినులతో స్నేహపూర్వకంగా మాట్లాడిన డీఈఓ వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో విద్యార్థినులు కూడా ఎంతో ఉత్సాహంగా స్పందిం చారు. తమ మధ్యకు వచ్చి రాఖీలు కట్టించు కోవడంతో పాటు తమతో కలిసి భోజనం చేయడం పట్ల విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు.రాఖీ వేడుకలకు ప్రత్యేకతను తీసుకొచ్చే విధంగా డీఈఓ రమేష్‌కుమార్ కేజీబీవీ విద్యార్థిను లతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థి నులతో కలిసి భోజనం చేస్తూ వారి సాధక బాధకాలను తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేయడం ద్వారా వారిలో ఆత్మీ యత, భరోసా కల్పించేలా వ్యవహరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పర స్పర ఆత్మీయతతో మెలిగినప్పుడే విద్యా వాతా వరణం మరింత ఆహ్లాదకరంగా ఉంటుందని డిఇఓ తెలిపారు.

ఈ సందర్భంగా డీఈఓ రమేష్ కుమార్ మాట్లా డుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదలతో ముందు కు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరో హించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కేజీబీవీలలో చదువుతున్న బాలిక లకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అవ సరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి నుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, ఉపాధ్యా యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఘనంగా నూలు పూర్ణిమ వేడుకలు



జడ్చర్ల, ఆగస్టు 28 (జనంసాక్షి): కావేరమ్మపేట భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అంబా భవాని మాత దేవాలయంలో నూలు పూర్ణిమ, రాఖీ పండగ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆంజనేయస్వామి గుడి నుంచి భవాని ఆలయం వరకు భజనలు, ఖడ్గాల ప్రదర్శనతో మార్కండేయ స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గాయత్రి హోమం జరిపి పంచహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పద్మశాలి కులబంధువులు గాయత్రీ ధారణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు పున్న కాశి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి వగ్గు శ్రీధర్, ఉపాధ్యక్షులు మారేపల్లి శ్రీనివాసులు, ఎల్ల రామస్వామి, ఉప కార్యదర్శి చిక్కా శ్రీనివాస్, కోశాధికారి నక్క చంద్రశేఖర్, సంబారి బాలస్వామి, ఎల్ల హరిప్రసాద్, రుమాండ్ల సత్యనారాయణ, రుమాండ్ల పర్వతాలు, ఉస్కమురి జంగయ్య, చిక్క వెంకటయ్య, గుంత వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అన్న చెల్లెల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

- చెల్లెమ్మల ఆశీర్వాదం అందుకున్న అన్నయ్యలు



శివ్వంపేట, ఆగస్ట్ 28 (జనంసాక్షి): మండల పరిధిలోని వివిధ గ్రామాల తో పాటుగా మండల కేంద్రమైన శివంపేటలో శుక్రవారం ప్రజలం దరూ రాఖీ పౌర్ణమా పండుగను ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పండుగను పురస్కరించుకొని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన అక్కచెల్లెలు వారి వారి అన్నదమ్ములకు రాఖీలు కట్టి వారి చల్లటి దీవెనలు తెలియజేసి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# సీఐకి రాఖీ కట్టిన ఎస్ఐ రేవతి

- పోలీస్ స్టేషన్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు
- సిబ్బంది మధ్య వెల్లివిరిసిన సోదరభావం



మక్తల్, ఆగస్టు 28 (జనంసాక్షి): రక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఆత్మీయ వాతావరణం నెలకొంది. శుక్రవారం స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్ఐ రేవతి, స్థానిక సీఐకి రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సీఐ ఆమెకు ఆశీస్సులు అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

?ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాఖీ పండుగ అనేది అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే స్వచ్ఛమైన ప్రేమ, ఆప్యాయత, విడదీయరాని అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. నిరంతరం ప్రజాసేవలో ఉండే పోలీస్ శాఖలోని కుటుంబ సభ్యుల మధ్య కూడా ఇటువంటి సోదరభావం, పరస్పర గౌరవం, ఆత్మీయత మరింతగా బలపడాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ పవిత్రమైన రక్షాబంధన్ పర్వదినాన్ని ప్రజలందరూ సుఖసంతోషాలతో, సురక్షితంగా జరుపుకోవాలని పోలీస్ అధికారులు, సిబ్బంది నియోజకవర్గ ప్రజలకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

- కొల్చారం మండల వ్యాప్తంగా ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



కొల్చారం, ఆగస్టు 28 (జనంసాక్షి): రక్షాబంధన్ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తూ ప్రేమ, ఆప్యాయత, సోదర భావానికి ప్రతీకగా నిలిచింది. "నీకు నేను రక్ష.. నాకు నీవు రక్ష.. మనమిద్దరం దేశానికి రక్ష" అంటూ అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు పరస్పరం ప్రతిజ్ఞ చేసుకున్నారు.

# రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో ఆగస్ట్ 28(జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని యెనుగొండలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కె.జి.బి.వి.)లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులతో కలిసి రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థినులందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ పండుగ సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉదయం పాఠశాలకు చేరుకున్న అదనపు కలెక్టర్ విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం వారితో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి విద్య, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి వేడుకల్లో భాగంగా కె.జి.బి.వి. విద్యార్థినులు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ తమతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొని, అల్పాహారం చేయడం పట్ల విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.జి.బి.వి. ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.







# NEET-PG కేంద్రాల తనిఖీ - అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

- మహబూబ్‌నగర్‌లో NEET-PG కి సర్వం సిద్ధం
- 30న NEET-PG పరీక్ష - ఏర్పాట్లు
- ఆగస్టు 30న మహబూబ్‌నగర్‌లో NEET-PG పరీక్ష - ఫాతిమా స్కూల్
- JPNCE, ధర్మాపూర్ కేంద్రాల పరిశీలన

**మహబూబ్‌నగర్, బ్యూరో ఆగస్టు 28 (జనంసాక్షి):** జిల్లాలో ఆగస్టు 30న నిర్వహించనున్న NEET-PG 2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రం క్రిస్టియన్ పల్లిలోని ఫాతిమా స్కూల్, JPNCE, ధర్మాపూర్‌లో ఏర్పాటు చేసిన NEET-PG పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా అభ్యర్థులకు కల్పించనున్న మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 30న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షను ప్రశాంతంగా, సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని, పరీక్షా నిబంధనలను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.





## శిశుమందిర్ లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**పెద్ద శంకరంపేట్, ఆగస్ట్ 28 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పెద్ద శంకరంపేటతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ప్రజలు రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి విశిష్టతను ప్రధానాచార్యులు లక్ష్మీనారాయణ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు ఒకరికి ఒకరు రాఖీ పౌర్ణమి శ్లోకాన్ని పటిస్తూ రాఖీలను కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ అధ్యక్షులు దాదిగారి గంగాధర్. ఉపాధ్యక్షులు జంగం రాఘవులు. ప్రబంధకారిని ఆర్ఎస్ఎస్ బాధ్యులు జైహింద్ రెడ్డి సీతారామారావు సతీష్ గౌడ్ బి వీరప్ప. రవి వర్మ ఆనంద్. శ్రీనివాస్. పాల్గొన్నారు.

## నంగునూరు మండల వ్యాప్తంగా ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**నంగునూరు, ఆగస్టు 28 (జనంసాక్షి):** నంగునూరు మండల వ్యాప్తంగా రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) వేడుకలు శుక్రవారం నాడు అత్యంత వైభవంగా, అట్టహాసంగా జరిగాయి. అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.

ఉదయం నుంచే సోదరీమణులు సాంప్రదాయ దుస్తులు ధరించి, తమ సోదరులకు నుదుట తిలకం దిద్ది, హారతులు ఇచ్చి రాఖీలు కట్టారు. తమ అన్నదమ్ములు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ మిఠాయిలు తినిపించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు రక్షణగా ఉంటామని మాట ఇస్తూ, వారికి ప్రత్యేక కానుకలు, నగదు అందజేసి తమ ప్రేమను చాటుకున్నారు.

## కల్హేర్ మండలంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా రాఖీ పండుగ





**కల్హేర్, ఆగస్టు 28(జనంసాక్షి):** అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమానురాగాలు, పరస్పర నమ్మకానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ వేడుకలు కల్హేర్ మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.ఉదయం నుంచే మహిళలు, యువతులు,చిన్నారులు కొత్త దుస్తులు ధరించి రాఖీలతో సిద్ధమయ్యారు.

## అందోల్ పాఠశాలలో రక్షాబంధన్

**జోగిపేట, ఆగస్టు 28 (జనంసాక్షి):** రక్షాబంధన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అందోల్ మండలం అందోల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవి సింగ్ ఆధ్వర్యంలో గురువారం రోజు రక్షాబంధన్ కార్యక్రమం జరిగింది. ఇందులో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని నీవు నాకు రక్ష నేను నీకు రక్ష ఇద్దరం దేశానికి రక్ష అనుకుంటూ రాఖీలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అందోల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవి దాస్, తెలుగు భాష ఉపాధ్యాయులు నర్సింగ్ మాట్లాడుతూ అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల మధ్య ఉండే పవిత్రమైన ప్రేమకు రక్షణ బంధానికి ప్రతీకగా జరుపుకునే పండగ అని తెలిపారు.

## రక్షా బంధన్ స్ఫూర్తితో పరస్పర బంధాలు పెంపొందాలి

- బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నామాజీ



**నారాయణపేట ఆగస్టు 28(జనంసాక్షి):** అనాదిగా వస్తున్న రక్షాబంధన్ స్ఫూర్తితో ప్రజల్లో పరస్పర బంధాలు పెంపొందాలని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ ఆకాంక్షించారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో నాగురావు నామాజీ, కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ అక్కా చెల్లెళ్లతో రాఖీలు కట్టించుకుని సంబరాలు జరుపు కున్నారు. ఈ సందర్భంగా నాగురావు నామాజీ మాట్లాడుతూ రక్షా బంధన్ పర్వదినం ఒక్క అక్కా చెల్లెళ్లకు అన్నదమ్ములకు మాత్రమే పరిమితం కాదని ప్రజల్లో పరస్పర సంబంధం పెంచుకోవాలని కోరారు. రాష్ట్ర,జిల్లా ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.


## సురేష్‌రెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి

- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన కసిరెడ్డి



**కల్వకుర్తి,ఆగస్టు 28(జనంసాక్షి):** హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన తాండ్ర నివాసి కాయితి సురేష్‌రెడ్డి మృతదేహానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సురేష్‌రెడ్డి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి,వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్కా-తమ్ముడి అనుబంధానికి ప్రతీకగా రాఖీ వేడుక



**నాగల్గిద్ద ఆగస్ట్ 27 (జనంసాక్షి):** రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్క తన తమ్ముడికి రాఖీ కట్టి ఆప్యాయంగా శుభాకాంక్షలు తెలిపింది. అన్నాచెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను కుటుంబ సభ్యుల సమక్షంలో ఆనందంగా జరుపుకున్నారు. తమ్ముడి సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అక్క ఆకాంక్షించింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఒకరికొకరు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రేమానురాగాలకు ప్రతీక రక్షాబంధన్





**కోహీర్, ఆగస్టు 28 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని చింతలగట్టు కేంద్రంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోదర, సోదరీమణులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ఆత్మీయతను చాటుకున్నారు. దీంతో చింతలగట్టు కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

## సమాజంలో అనుబంధాలు పెంపొందాలి: ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి



**నారాయణపేట, ఆగస్టు 28(జనంసాక్షి):** రక్షా బంధన్ స్ఫూర్తితో సమాజంలో అనుబంధాలు పెంపొందాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు. శుక్రవారం రాఖీ పండగ సందర్భంగా హైదరాబాద్‌లోని నివాసంలో తమ్ముడు, పిసిసి సభ్యుడు చిట్టెం అభిజయ్ రెడ్డికి రాఖీ కట్టి ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి రక్షా బంధన్ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా

**తెలకపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి):** టీజీ ట్రాన్స్‌కో పరిధిలోని నాగర్‌కర్నూల్ 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా మండలంలో నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి శాంతన్ తేజ తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా తెలకపల్లి, పెద్దూరు, గోలగుండం, చిన్నముద్దునూర్, తాళ్లపల్లి, పుల్లల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయంలో సింగిల్ ఫేజ్ సరఫరా అందిస్తామని పేర్కొన్నారు. మెయింటెనెన్స్ పనులు పూర్తయిన అనంతరం త్రీ–ఫేజ్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

## కొండ లక్ష్మణ్‌కి ఘన సన్మానం



**అమీన్పూర్, ఆగస్టు 28 (జనంసాక్షి):** భాజపా జిల్లా ట్రేడ్ సెల్ కన్వీనర్ గా నియామకమైన కొండా లక్ష్మణ్‌ను బీరంగూడ ఆర్యవైశ్య నవరత్న సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నవరత్న సంఘం సభ్యులు మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ భాజపాలు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని అభినందించారు. సన్మానించిన వారిలో బీరంగూడ ఆర్యవైశ్య నవరత్న సంఘం అధ్యక్షుడు రవిచంద్ర, సభ్యులు సతీష్ ఆనంద్ అశోక్ తదితరులున్నారు.

## వైభవంగా మార్కండేయ స్వామి పల్లకి సేవ



**నారాయణపేట, ఆగస్టు 28 (జనంసాక్షి):** నారాయణపేట పట్టణంలోని సుభాష్ రోడ్డు లో వెలిసిన భక్త మార్కండేశ్వర స్వామి దేవాలయంలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన విశేష పూజలు చేపట్టారు. మహా మంగళహారతి నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం యజ్ఞం, యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. సాయంత్రం సుభాష్ రోడ్ లోని భక్త మార్కండేయ స్వామి వారి పల్లకి సేవ భక్తులు, భక్తి భజన సంకీర్తనలు ఆలపిస్తూ పట్టణ పురవీధుల మీదుగా సెంటర్ చౌక్, సరఫ్ బజార్ గుండా మీదగా ఊరేగింపుగా చేపడుతూ పరిమళాపురంలోని శ్రీ అనంతశయన ఆలయం వరకు పల్లకిసేవా వైభవంగా నిర్వహించారు.

# సామాజిక న్యాయం కోసం వి.హెచ్.పి.ఎస్ నిరంతర పోరాటం

- ఘనంగా 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- వికలాంగులకు రూ.6 వేల పింఛన్ హామీని వెంటనే అమలు చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- జిల్లా ఇంచార్జ్ వి.ఎస్.రాజు మాదిగ

**సంగారెడ్డి ఆగస్టు 28 (జనంసాక్షి):** వికలాంగుల హక్కుల పోరాట సమితి (వి.హెచ్.పి.ఎస్) 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కన్వీనర్ దేవరంపల్లి అశోక్ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో కేక్ కట్‌చేసి, వి.హెచ్.పి.ఎస్ జెండాను ఆవిష్కరించారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా ఇంచార్జ్ వి.ఎస్. రాజు మాదిగ, ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు బుచ్చంద్ర మాదిగ హాజరై మాట్లాడారు.
ఈ సందర్భంగా వి.ఎస్. రాజు మాదిగ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఇచ్చిన రూ.6 వేల పింఛన్ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని, ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా అమలుచేయాలని కోరారు.
వి.హెచ్.పి.ఎస్ గత 19 సంవత్సరాలుగా వికలాంగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. వికలాంగులకు విద్య, ఉపాధి, సామాజిక భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సముచిత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి




సంఘం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం భవిష్యత్తులో కూడా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.హెచ్.పి.ఎస్ సభ్యులు డేవిడ్, ముజీబ్, ఆసిఫ్, వీరయ్య, రవి కుమార్, ఏసన్న, నవీన్ కుమార్, బంగారు కృష్ణ, మోహన్ మరియు ఎం ఆర్ పి ఎస్ అనుబంధం సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన మన్నాపూర్ సర్పంచ్ లలిత



**కొత్తపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి):** రాఖీ పౌర్ణమి సందర్భంగా మన్నాపూర్ గ్రామ సర్పంచ్ ఎం. లలిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టడం ఎంతో ఆనందంగా ఉందని సర్పంచ్ లలిత తెలిపారు. సోదరభావం, ఆత్మీయతకు ప్రతీకగా రాఖీ పండుగను ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## పాలమూరు గడ్డపై నేడు అన్నాచెల్లెళ్ల అనుబంధం





**మహబూబ్ నగర్ బ్యూరో ఆగస్టు 28(జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా, భావోద్వేగాల నడుమ సాగాయి. తెల్లవారుజాము నుంచే ప్రతి ఇల్లూ పవిత్రతకు, ఆత్మీయతకు నిలయంగా మారింది. అక్కచెల్లెళ్లు తలస్నానాలు ముగించి, నూతన వస్త్రాలు ధరించి పూజలు పూర్తి చేసిన తర్వాత, తమ అన్నదమ్ములకు ప్రేమతో తిలకం దిద్ది, మంగళహారతులు పట్టి రాఖీలు కట్టారు. 'నువ్వు నిత్యం చల్లగా ఉండాలి అన్నా' అంటూ చెల్లెళ్లు పలికే దీవెనలు, 'ఏ కష్టం వచ్చినా ముందుండి కాపాడుతాను' అంటూ అన్నలు ఇచ్చే భరోసా మాటల్లో చెప్పలేని మధురానుభూతిని పంచాయి.

## పేట జిల్లా ఛత్రపతి శివాజీ సేన అధ్యక్షుడిగా బాదేపల్లి నరేష్ గౌడ్



**నారాయణపేట, ఆగస్టు 28(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా ఛత్రపతి శివాజీ సేన అధ్యక్షుడిగా మక్తల్ పట్టణానికి చెందిన బాదేపల్లి నరేష్ గౌడ్ నియమించినట్లు ఛత్రపతి శివాజీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తోట మధుకర్ తెలిపారు. నారా యణపేట జిల్లాలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఛత్రపతి శివాజీ సేనను మరింత బలోపేతం చేయడంతో పాటు, సంస్థ కార్యకలాపాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతలను బాదేపల్లి నరేష్ గౌడ్‌కు అప్పగించి నట్లు ఆయన పేర్కొన్నారు.

## బాలానగర్‌లో ఘనంగా ముగిసిన బోనాలు



**బాలానగర్, ఆగస్టు 28 (జనంసాక్షి):** బాలానగర్ మండల కేంద్రంతో పాటు అమ్మపల్లి గ్రామాలలో గత రెండు రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్న కోట మైసమ్మ, పోచమ్మ, యావాలమ్మ, ఎల్లమ్మ బోనాల జాతర గురువారం ఘనంగా ముగిసింది.
తెల్లవారుజాము నుండే మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకుని అమ్మవారి ఆలయాలకు తరలివచ్చారు. శివసత్తుల విన్యాసాలు,శివనామస్మరణ, పూనకాలు, అఘోరాల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో మండల కేంద్రం మార్మోగింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి, తమ కుటుంబాల సుఖసంతోషాల కోసం మొక్కులు చెల్లించుకున్నారు.
బంధుమిత్రులతో కలిసి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో బాలానగర్ మండల కేంద్రం కిక్కిరిసిపోయింది. ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా రక్షాబంధన్



**నారాయణపేట, ఆగస్టు 28(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల లో రక్షాబంధన్ పర్వదిన వేడుకలు అత్యంత ఘనం గా, ఉత్సాహభరిత వాతావ రణంలో జరిగాయి. భారతీ య సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టు కొని, పరస్పర రక్షణ, సోద రభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణపేట జిల్లా కార్యదర్శి దూస సీతారా ములు గారు మాట్లాడుతూ రక్షాబంధన్ కేవలం అన్నా చెల్లెళ్ల బంధానికే పరిమితం కాకుండా, సమాజంలో పరస్పర ప్రేమ, సామరస్యం, రక్షణ భావాలను పెంపొందించే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే భారతీయ సంస్కృతి, నైతిక విలువల ను అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షులు గుడిపల్లి రాఘవేంద్ర రెడ్డి, ప్రధానా చార్యులు దత్తు చౌదరి, పాఠశాల ఆచార్యులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పెంట్లవెల్లి మండల కేంద్రంలో గంగమ్మ తల్లికి బోనాలు..

- గంగపుత్ర, ముదిరాజుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- మొలకల బుట్టలతో చిన్నారులు, బోనాలతో మహిళలు
- గంగపుత్ర ఐక్యతకు నిదర్శనంగా గంగమ్మ తల్లి బోనాల వేడుకలు..

**పెంట్లవెల్లి ఆగస్టు 28 (జనంసాక్షి):** పెంట్లవెల్లి మండల కేంద్రంలో గంగమ్మ తల్లి బోనాల వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించుకున్న బోనాలను తలపై ఎత్తుకొని గంగమ్మ



తల్లికి మొక్కులు చెల్లించేందుకు భారీ ఊరేంపుగా తరలివచ్చారు. డప్పు వాయిద్యాల మంగళ వాయిద్యాల నడుమ సాగిన బోనాల ఊరేగింపు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణంగా నిలిచింది

## మూడు నవలల ముచ్చటతో పాలమూరు సాహిత్య వైభవానికి వేదిక

• సాహిత్య సభ కరపత్రాలు ఆవిష్కరించిన నాగర్‌కర్నూల్ కవులు, రచయితలు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి):** పాలమూరు ప్రాంత చరిత్ర, సంస్కృతి, ప్రజా జీవన పోరాటాలను అక్షర రూపంలో ఆవిష్కరించిన మూడు ముఖ్యమైన నవలలపై చర్చ, పరిచయం, సమీక్షలతో 'మూడు నవలల ముచ్చట' పేరుతో సాహిత్య సభ నిర్వహించనున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఆదివారం మహబూబ్‌నగర్‌లోని అరుంధతి భవన్‌లో ఈ సాహిత్య సభ జరుగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన కవులు, కళాకారులు, రచయితలు సాహిత్య సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పాలమూరు ప్రాంత సాహిత్య చరిత్ర, ప్రజా ఉద్యమాలు, సామాజిక పరిణామాలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే మూడు నవలలను ఒకే వేదికపై పరిచయం చేసి, వాటిపై విస్తృతంగా చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**మూడు నవలలపై ప్రత్యేక చర్చ...**

ఈ సాహిత్య సభలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన నవలా రచయిత బెక్కెం జనార్దన్ రచించిన 'పండుగ సాయన్న' నవలపై చర్చించనున్నారు. పాలమూరు ప్రాంత ప్రజల జీవన నేపథ్యం, తిరుగుబాటు స్ఫూర్తి, సామాన్య ప్రజల పోరాటాలను ప్రతిబింబించే అంశాలపై సాహిత్యకారులు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు. పూర్వ తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు నందిని సిద్ధారెడ్డి రచించిన 'నాగటి తరం' నవలపై కూడా సభలో విశ్లేషణ, సమీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ సమాజ పరిణామ క్రమం, ప్రజల జీవన పరిస్థితులు, సామాజిక మార్పులు తదితర అంశాలపై నవలలోని సాహిత్య కోణాలను ఈ సందర్భంగా చర్చించనున్నట్లు తెలిపారు.

**తెలంగాణ మట్టి పొత్తిళ్ల కదలికలకు ప్రతిబింబాలు...**

ఈ మూడు నవలలు తెలంగాణ మట్టి పొత్తిళ్లలోని కదలికలకు ప్రతిబింబాలుగా నిలుస్తాయని సాహిత్యకారులు పేర్కొన్నారు. దాదాపు రెండు వందల సంవత్సరాల పాలమూరు, తెలంగాణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితిగతులకు ఈ రచనలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని తెలిపారు.సామాన్య ప్రజలు నాయకులుగా ఎదిగి, అన్యాయానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన గాథలు, అప్పటి ప్రజల జీవన విధానం, కష్టాలు, కన్నీళ్లు, గోసలు, సామాజిక పరిస్థితులు, పోరాటాలు, సంస్కృతి, సంప్రదాయాలు వంటి అనేక అంశాలు ఈ మూడు నవలల్లో ప్రతిఫలించాయని వివరించారు. చరిత్రను కేవలం పుస్తకాలలో చదవడమే కాకుండా, ప్రజల జీవన అనుభవాల ద్వారా సాహిత్యంలో ఎలా ప్రతిబింబించిందో ఈ సభ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలి...**

పాలమూరు ప్రాంత సాహిత్య, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ఈ సాహిత్య సభకు కవులు, రచయితలు, కథకులు, నవలాకారులు, ప్రజా ఉద్యమకారులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య, పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక కన్వీనర్ గుడిపల్లి నిరంజన్, సీనియర్ జర్నలిస్ట్ కందికొండ మోహన్, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కల్వకోలు మద్దిలేటి, ప్రముఖ కవి ఎదిరేపల్లి కాశన్న, 'పోర్య తార' నవల రచయిత వెంకట్ పవార్, ఎం.డి. ఖాజా, గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వానల కోసం కప్ప తల్లి ఆచారం

• వరుణ దేవుడి కరుణ కోసం కుడికిల్లలో మహిళల ప్రత్యేక పూజలు



**కొల్లాపూర్, ఆగస్టు 28 (జనంసాక్షి):** వర్షాలు కురవక పంట పొలాలు ఎండిపోతుండటంతో వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకుని సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ కొల్లాపూర్ మండలంలోని కుడికిల్ల గ్రామంలో మహిళలు శుక్రవారం సాంప్రదాయబద్ధంగా 'కప్ప తల్లి' ఆచారాన్ని నిర్వహించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, చెరువులు, కుంటలు నీటితో నిండాలని ఆకాంక్షిస్తూ మహిళలు ప్రత్యేక పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యమైనప్పుడు, ఎండలు తీవ్రంగా ఉండి కరువు పరిస్థితులు ఏర్పడిన సందర్భాల్లో వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు పూర్వకాలం నుంచి కొనసాగుతున్న సంప్రదాయాల్లో కప్ప తల్లి ఆచారం ఒకటిగా గ్రామస్తులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఓ కర్రకు పచ్చని వేప మండలను కట్టి, వాటి మధ్యలో కప్పను ఉంచి గ్రామంలోని మహిళలు ఇంటింటికీ తిరుగుతూ వర్షాలు కురవాలని ప్రార్థించారు.

**జానపద గేయాలతో వాన కోసం వేడుకోలు...**

మహిళలు వేప మండలను చేతబట్టి గ్రామంలోని ప్రతి వీధిలో తిరుగుతూ రామోజీ రామా.. వరుణ దేవా.. వానలు కురిపించు అంటూ సంప్రదాయ జానపద గేయాలు ఆలపించారు. పాటలు పాడుతూ, నీళ్లు చల్లుతూ, పూజలు నిర్వహిస్తూ వరుణ దేవుడిని కరుణించమని వేడుకున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి ముందు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కుకున్నారు.ఇంటింటికీ వెళ్లిన సమయంలో గృహిణులు మహిళల కాళ్లపై నీళ్లు చల్లి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కప్ప తల్లికి పసుపు, కుంకుమ సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం బియ్యం, ధాన్యం, ఇతర నైవేద్యాలు లేదా తమకు తోచిన మేరకు కానుకలను దానంగా అందించారు.

**వర్షాలు లేక రైతుల్లో ఆందోళన...**

ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. విత్తనాలు వేసినప్పటికీ తగినంత వర్షం లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు సక్రమంగా మొలకెత్తడం లేదని, ఇప్పటికే మొలకెత్తిన పంటలు సైతం నీటి కొరతతో ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తూ అలసిపోయిన తరుణంలో ప్రకృతే తమను ఆదుకోవాలని, వరుణ దేవుడి కరుణతో త్వరగా వర్షాలు కురవాలని కోరుకుంటూ ఈ సాంప్రదాయ వేడుకను నిర్వహించినట్లు మహిళలు తెలిపారు.

**పచ్చని పంట పొలాల కోసం ప్రార్థనలు...**

కప్ప తల్లి ఆచారం నిర్వహించడం ద్వారా వరుణ దేవుడు శాంతించి సమృద్ధిగా వర్షాలు కురిపిస్తాడని గ్రామస్తుల విశ్వాసం. త్వరలోనే వర్షాలు కురిసి గ్రామంలోని చెరువులు, కుంటలు నిండాలని, బావుల్లో నీటిమట్టాలు పెరగాలని, పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడాలని మహిళలు ప్రార్థించారు.తమ పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాలను కొనసాగిస్తూ గ్రామ ప్రజలు ప్రకృతితో తమకున్న అనుబంధాన్ని చాటుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మంచి దిగుబడులు రావాలని, గ్రామంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకుంటూ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పేట బస్టాండ్‌లో రాఖీ వేడుకలు





**నారాయణపేట, ఆగస్టు 28(జనంసాక్షి):** రాఖీ పౌర్ణమి సందర్భంగా విధి నిర్వహణలో ఉండి తమ కుటుంబ సభ్యులతో రాఖీ పండుగ ను జరుపుకోలేని డ్రైవర్లు, కండక్టర్ల కోసం నారాయణ పేట డిపో పరిధిలోని స్థానిక బస్టాండ్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ రేసు రాంమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లకు రాఖీలు కట్టి, పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ఆర్టీసీ సిబ్బందితో పాటు ప్రయాణికులు, వారి బంధువులు కూడా పాల్గొని రాఖీ పౌర్ణమి సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.ప్రజలకు నిరంతరం రవాణా సేవలు అందిస్తూ పండుగ రోజుల్లో కూడా విధులు నిర్వహించే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు పండుగ వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు, టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ ఆదేశానుసారం ఈ రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించినట్లు డిపో మేనేజర్ రేసు రాంమోహన్ తెలియజేశారు.

# చక్రపాణి నా తండ్రే.. DNA టెస్టుకు సిద్ధం

• తండ్రి గుర్తింపు కోసం తల్లీకొడుకుల ధర్నా



గద్వాల, ఆగస్టు 28(జనం సాక్షి) న్యాయం కోసం ఓ తల్లి, కొడుకు వీధిన పడ్డారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని భీమ్ నగర్ కాలనీలో చక్రపాణి అనే వ్యక్తి ఇంటి ముందు బాధితురాలు రేణుక తన 21 ఏళ్ల కుమారుడు పవన్ తో కలిసి ధర్నాకు దిగింది. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది.రేణుక తెలిపిన వివరాల ప్రకారం.. గత 10 ఏళ్లుగా చక్రపాణి ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో సహజీవనం చేశాడని ఆరోపించింది. తమకు 21 ఏళ్ల కుమారుడు పవన్ ఉన్నాడని, ఇన్నేళ్లుగా పెళ్లి పేరుతో కాలయాపన చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది.తాను చక్రపాణి సంతానమేనని, తండ్రి గుర్తింపు కావాలని యువకుడు పవన్ డిమాండ్ చేస్తున్నాడు. తన తండ్రి ఎవరో తేల్చేందుకు డిఎన్ఏ పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు.న్యాయం అడిగితే "నిన్ను, నీ బాబును చంపేస్తా" అంటూ చక్రపాణి బెదిరిస్తున్నాడని ఆరోపించారు. తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని, పోలీసులు, అధికారులు స్పందించాలని తల్లీకొడుకులు వేడుకుంటున్నారు.

## చెట్లను సోదరుల్లా భావించి రాఖీలు కట్టిన విద్యార్థులు



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 28 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ రాఖీ పండుగను పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు వినూత్న కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్ మరియు కళాశాల ఎకోక్లబ్ మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యంలో ప్రకృతిని పరిరక్షించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కళాశాల ఆవరణలోని చెట్లకు రాఖీలు కట్టి వాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మాట్లాడుతూ, ప్రస్తుతమే కాకుండా భవిష్యత్తు కూడా ప్రకృతిపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని పేర్కొన్నారు. అన్నాచెల్లెళ్లు ఒకరినొకరు రక్షించుకునే ప్రతిజ్ఞతో రాఖీ కట్టుకున్నట్లే, చెట్లకు రాఖీలు కట్టి వాటిని సంరక్షించాలనే సంకల్పం తీసుకోవడం మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. విద్యార్థులు ఒక్కొక్కరు చెట్లను దత్తత తీసుకొని వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన, బాధ్యతను పెంపొందించేందుకు ఎంతో దోహద పడుతుందన్నారు.

## హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో వేడుకగా రాఖీ పండుగ



**మక్తల్, ఆగస్టు 28 (జనంసాక్షి):** హెచ్‌పీసీఎల్ కంపెనీ వార్షిక క్యాలెండర్‌లో భాగంగా ప్రతి భారతీయ సంప్రదాయ పండుగను ఘనంగా నిర్వహించాలన్న ఆదేశాల మేరకు, శుక్రవారం మక్తల్ చెరువు కట్ట దగ్గర ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో మేనేజర్ వి. వెంకటేష్ ఆధ్వర్యంలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా బంక్‌లోని మహిళా సిబ్బంది పెట్రోల్, డీజిల్ పోయించుకోవడానికి వచ్చిన వినియోగదారులను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. అంతేకాకుండా, సోదర భావంతో వారి చేతులకు రాఖీలు కట్టి, నోరు తీపి చేసి స్వీట్లు తినిపించారు.

ఈ వినూత్న వేడుకపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సంప్రదాయాల వల్ల మహిళలపై గౌరవం మరింత పెరుగుతుందని కొనియాడారు. ముఖ్యంగా అక్కాచెల్లెళ్లు లేని కొందరు వినియోగదారులు పెట్రోల్ బంక్ యాజమాన్యం నిర్వహించిన ఈ వేడుక ద్వారా రాఖీ కట్టించుకోవడం పట్ల తమ సంతోషాన్ని, ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ మహమ్మద్ అబ్దుల్ కరీం, వినియోగదారులు శ్రీశైలం, రామాంజనేయులు, పాండు, బంక్ సిబ్బంది శంకర్, గణేష్, షాలివన్, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.